39% నైపుణ్యాలు పనికిరావు!

- 2030 నాటికి ఉద్యోగాలపై ఏఐ తీవ్రప్రభావం
- ప్రపంచ ఆర్థిక వేదిక నివేదిక

దావోస్, జనవరి 18: ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌ను కృత్రిమ మేధ(ఏఐ) తీవ్రంగా ప్రభావితం చేస్తున్న తరుణంలో ఊహించిన దాన్ని కన్నా వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రస్తుతమున్న నైపుణ్యాల్లో 39 శాతం 2030 నాటికి పనికి రాకుండా పోతాయని ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. డబ్ల్యూఈఎఫ్ తాజా నివేదిక ప్రకారం ఏఐకు అనుగుణంగా తమ వ్యాపారాలను తీర్చిదిద్దుకోవాలని సగం కంపెనీలు నిర్ణయించుకోగా.. మూడింట రెండొంతుల కంపెనీలు ఏఐ నైపుణ్యాలు కలిగిన వారిని ఉద్యోగులుగా నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకొన్నాయి. ఇదే సమయంలో ఆటోమేషన్ కారణంగా తమ శ్రామిక శక్తిలో 40 శాతం మందిని తగ్గించుకోవాలని ప్రణాళికలు వేసుకొంటున్నాయి. డబ్ల్యూఈఎఫ్ ఉద్యోగాల భవిష్యత్తు నివేదిక-2025 ప్రకారం రానున్న అయిదేండ్లలో క్లరికల్, సచివాలయ ఉద్యోగాలు వేగంగా తగ్గిపోతాయి. అడ్మిన్ అసిస్టెంట్స్, టికెట్ క్లర్క్స్, క్యాషియర్స్ వంటి ఉద్యోగాలను ఏఐ ఆధారిత టూల్స్, ఆటోమేషన్ భర్తీ చేస్తాయి. అదే సమయంలో మనుషుల ప్రమేయం తప్పనిసరైన బట్వాడా, నిర్మాణం, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ రంగాల్లో ఉద్యోగాల సంఖ్య పెరుగుతుంది. నర్సింగ్, సంఘ సేవ, వ్యక్తిగత సంరక్షణ లాంటి సేవా రంగాల్లోనూ కొలువులు ఎక్కువవుతాయి. పెరుగుతున్న జీవన వ్యయం 16 లక్షల ఉద్యోగాల తొలగింపునకు కారణం కావొచ్చు. వాణిజ్య ఆంక్షలు, ఆర్థిక సవాళ్లు ప్రపంచ శ్రామిక మార్కెట్‌ను పునర్ నిర్వచించడంపై ఒత్తిడి తెస్తాయి. ఉద్యోగాల తొలగింపు, సృష్టికి మధ్య 2030 నాటికి 7.8 కోట్ల ఉద్యోగాల్లో వృద్ధి కనిపిస్తుందని.. అత్యాధునిక నైపుణ్యాలను అన్వయించుకోవడం భవిష్యత్తు కార్మిక శక్తిపై ప్రభావం చూపిస్తుందని నివేదిక అంచనా వేసింది.

లవ్ అఫైర్స్ వల్లే కోటాలో ఆత్మహత్యలు!

రాజస్థాన్ విద్యా మంత్రి

కోటా, జనవరి 18: ప్రవేశ, పోటీ పరీక్షల కోచింగ్ హబ్‌గా పేరొందిన రాజస్థాన్‌లోని కోటాలో ప్రతి ఏడాది అధిక సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం పట్ల ఆ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి మదన్ దిల్వార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రేమ వ్యవహారాల కారణంగానే కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, చదువు కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దని ఆయన కోరారు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని సూచించారు. ప్రతి విద్యార్థికి కొన్ని రంగాలపై ఆసక్తి ఉంటుందని, దానికి వ్యతిరేకంగా వారి లక్ష్యాలను బలవంతంగా నిర్దేశించినప్పుడే వారు తీవ్ర ఒత్తిడికి లోనవుతారని అన్నారు.

మరో విద్యార్థి సూసైడ్

కోటాలో జేఈఈకి కోచింగ్ తీసుకుంటున్న 16 ఏండ్ల మనన్ జైన్ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేండ్లుగా కోటాలో ఉంటూ జేఈఈ మెయిన్‌కు శిక్షణ పొందుతున్న మనన్ జైన్ తెలివైన వాడని, కుటుంబ సభ్యులు తెలిపారు.

రైతులతో చర్చలకు కేంద్రం ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో ధర్నా చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఓ సందేశాన్ని పంపింది. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల నేతలతో కేంద్ర ప్రభుత్వ అధికారులు శనివారం సుమారు రెండు గంటలపాటు సమావేశమయ్యారు. అనంతరం రైతు నేత కాకా సింగ్ కోట్రా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనపై తాము చర్చిస్తామని చెప్పారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత డల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి గురించి కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలుసుకున్నారు.

ఎంటెక్ చేసి 'ఏం లాభం'!

- భారత్‌లో ఏడేండ్లుగా ఇంజినీరింగ్ పీజీ విద్యార్థుల సంఖ్యలో క్షీణత
- పరిశ్రమలు, కంపెనీల అవసరాలు తీర్చేలా కోర్సులు లేకపోవడమే ప్రధాన కారణం
- జీతాల్లోనూ కనిపించని పెరుగుదల
- సిలబస్‌లో సంస్కరణలు అవసరం

న్యూఢిల్లీ: మన దేశంలో ఎంటెక్ హవా తగ్గింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. ఆయా కోర్సులు విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయి. బీటెక్ కోర్సుల్లోనూ ప్రవేశాలు నిదానంగా పుంజుకుంటున్నాయి. ఈ పరిస్థితికి కారణాలను పరిశీలిస్తే, ఎంటెక్‌లో ప్రాక్టికల్, అప్లికేషన్ బేస్డ్ స్కిల్స్‌పై కన్నా పరిశోధన ఆధారిత అంశాలపైనే దృష్టి పెట్టడం వల్ల కంపెనీలు, పరిశ్రమల యాజమాన్యాలు బీటెక్ గ్రాడ్యుయేట్లకే ప్రాధాన్యమిస్తున్నాయి. బీటెక్ చదివినవారిని తీసుకుంటే, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసినవారిని తీసుకున్నపుడు భరించాల్సిన అదనపు ఖర్చులు చెల్లించనక్కర్లేదని భావిస్తున్నాయి. మరోవైపు ఎంటెక్ వల్ల అదనంగా లభించే ఆర్థిక ప్రయోజనాలేవీ లేనందువల్ల విద్యార్థులు కూడా అటువైపు దృష్టి సారించడం లేదు. పీహెచ్‌డీ చేయాలంటే ఎంటెక్ అవసరం లేకపోవడం కూడా ఎంటెక్‌లో చేరికలు తగ్గడానికి మరొక కారణం. ఈ నేపథ్యంలో ఎంటెక్ కోర్సులను అత్యవసరంగా సంస్కరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) వెల్లడించిన సమాచారం ప్రకారం, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలు ఏడేళ్ల కనిష్ఠానికి పతనమయ్యాయి. ఏడేండ్ల క్రితం ఎంటెక్ కోర్సుల్లో 68,677 మంది చేరగా, గడచిన రెండు విద్యా సంవత్సరాల్లో సంవత్సరానికి దాదాపు 45 వేల మంది మాత్రమే చేరారు. మొత్తం పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు 2017-18లో 1.85 లక్షలు కాగా, 2023-24లో 1.24 లక్షలకు తగ్గింది. కానీ ఖాళీ సీట్ల సంఖ్య 63 శాతం నుంచి 64 శాతానికి పెరిగింది. దీనిని బట్టి, ఎంటెక్ డిగ్రీకి ఉన్నట్లు చెప్పుకునే గొప్ప విలువకు, వాస్తవంగా దానివల్ల లభించే కెరీర్ అవకాశాలు, జీతాలు వంటి ప్రయోజనాలకు మధ్య ఎంత తీవ్రమైన అంతరం ఉందో స్పష్టమవుతుంది.

బీటెక్‌లోనూ సగం సీట్లు ఖాళీ

బీటెక్ పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. 2017-18లో 14.75 లక్షల సీట్లలో దాదాపు సగం, అంటే, 7.25 లక్షల సీట్లు ఖాళీగా ఉన్నాయి. అయితే, 2023-24లో మొత్తం బీటెక్ సీట్లు 13.49 లక్షలు కాగా, కేవలం 17 శాతం, అంటే, 2.28 లక్షల సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. బీటెక్ ఎన్‌రోల్‌మెంట్ 2022-23లో 10.36 లక్షల నుంచి 2023-24లో 11.21 లక్షలకు పెరిగింది. ఈ పరిణామాలపై ఏఐసీటీఈ మెంబర్ సెక్రటరీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ, బీటెక్ చేసినవారికి వచ్చే జీతాలతో పోల్చినపుడు ఎంటెక్ పూర్తయిన తర్వాత వచ్చే జీతాల్లో పెద్దగా మార్పులు ఉండటం లేదన్నారు. అందుకే విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌వైపు మొగ్గు చూపడం లేదన్నారు. బోధన పట్ల ఆసక్తి గల వారు మాత్రమే ఎంటెక్ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏఐసీటీఈ మాజీ చైర్మన్ ఎస్ఎస్ మంథా మాట్లాడుతూ, సమకాలిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను ఇచ్చే బీటెక్‌పైనే పరిశ్రమలు దృష్టి పెడుతున్నాయని, పీజీ విద్యలో అదనపు విలువలు పారిశ్రామిక రంగానికి కనిపించడం లేదని చెప్పారు. అవసరమైన పనిని బీటెక్ చదివిన వారి చేత చేయించుకోగలిగినపుడు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసినవారిని ఎందుకు నియమించుకోవాలి? ఎక్కువ జీతం ఎందుకు ఇవ్వాలి? అని పరిశ్రమలు ఆలోచిస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల్లో ప్రస్తుతం జరుగుతున్న దానికి అనుగుణంగా ఎంటెక్ పాఠ్యాంశాలను ఆధునికీకరించడం లేదన్నారు. మరోవైపు అండర్‌గ్రాడ్యుయేట్లు పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో మేనేజ్‌మెంట్‌ను తీసుకుంటున్నారని తెలిపారు. మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ పాఠ్యాంశాల్లో మార్పులు జరుగుతున్నాయన్నారు.

పీజీలో బోధనా సిబ్బంది కొరతే

ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ వీ రామగోపాల రావు మాట్లాడుతూ, టైర్-1 విద్యా సంస్థల్లో ఎంటెక్ సీట్లు భర్తీ అవుతున్నప్పటికీ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చేసరికి విద్యార్థులు వెళ్లిపోతున్నారని చెప్పారు. ప్రైవేట్ రంగంలో అత్యధిక జీతాలను ఆశించేవారు ఎంటెక్ కోర్సుల్లో కొనసాగుతున్నారన్నారు. టైర్-2, టైర్-3 విద్యా సంస్థల్లో ఎంటెక్ సీట్లు భర్తీ కావడం కష్టమేనని, ఎంటెక్ డిగ్రీ వల్ల అదనంగా వచ్చే విలువ ఏమీ ఉండకపోవడమే దీనికి కారణమని తెలిపారు. టైర్-2, టైర్-3 విద్యా సంస్థల్లో ఎంటెక్ కోర్సులు ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా లేవన్నారు. మాస్టర్స్ లెవెల్‌లో బోధించే ఫ్యాకల్టీ దొరకడం అంత సులభం కాదని చెప్పారు.

దూకుడుగా ఉన్నాడు.. నగలు ముట్టుకోలేదు

- సైఫ్‌పై దాడి కేసులో కరీనా వాంగ్మూలం
- పోలీసుల అదుపులో మరో నిందితుడు

ముంబై, జనవరి 18,(నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో ఆయన భార్య కరీనా కపూర్ శనివారం పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. ఆ రోజు నిందితుడు చాలా దూకుడుగా ఉన్నాడని, అయితే అక్కడ నగలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని అతడు ముట్టుకోలేదని ఆమె తెలిపారు. మరోవైపు ఇంతవరకు ఎవరినీ అరెస్ట్ చేసినట్టు పోలీసులు అధికారికంగా ప్రకటించ లేదు. అయితే దాడికి సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం 31 ఏండ్ల ఆకాశ్ కైలాష్ కన్నోజియాను ఆర్‌పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడు సైఫ్ ఇంటి సీసీ కెమెరాల్లో కన్పించిన నిందితుడా లేక మరో వ్యక్తా అన్న విషయాన్ని నిర్ధారించ లేదు. సైఫ్ మెడికల్ బిల్లు ఇప్పటివరకు సుమారు 40 లక్షలు అయ్యింది. అందులో 25 లక్షల రూపాయలు క్లెయిమ్‌ను ఆమోదించినట్టు వైద్య ఆరోగ్య బీమా సంస్థ నివా బుపా తెలిపింది.

కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి

బీజేపీ కుట్ర అని ఆప్ ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 18: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై శనివారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లదాడికి యత్నించారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆప్..ఇదంతా బీజేపీ కుట్రేనని ఆరోపించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న తరుణంలో..కేజ్రీవాల్ ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. అదే సమయంలో దుండగులు ఆయన కాన్వాయ్‌లోని ఓ కారుపై రాళ్లు రువ్వారు. ఘటనపై బీజేపీ స్పందిస్తూ, 'కేజ్రీవాల్ కాన్వాయ్ ఇద్దరు వ్యక్తులను ఢీ కొట్టింది. ఆ ఇద్దరినీ దవాఖానకు తరలించారు. ముందున్న ఓటమి గురించి ఆలోచిస్తూ, ప్రజల ప్రాణాలకున్న విలువను ఆయన మరిచిపోయారు. బాధితులను కలిసేందుకు దవాఖానకు వెళ్తున్నా' అని బీజేపీ నేత పర్వేశ్ వర్మ 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు.

ఆర్‌జీ కర్ డాక్టర్ రేప్ కేసులో

సంజయ్ రాయ్ దోషి

- కోల్‌కతా కోర్టు తీర్పు.. శిక్షపై రేపు ప్రకటన
- కోర్టులో విలపించిన బాధితురాలి తండ్రి

కోల్‌కతా, జనవరి 18: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ట్రెయినీ డాక్టర్ లైంగిక దాడి, హత్య ఘటనలో అరెస్టయిన సంజయ్ రాయ్‌ను న్యాయస్థానం శనివారం దోషిగా నిర్ధారించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీ కర్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. *2024* ఆగస్టు *9*న జరిగిన ఈ అమానుష ఘటనలో సాల్డా కోర్టు సోమవారం(జనవరి *20*) తీర్పును వెలువరిస్తుందని అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ తెలిపారు. మహిళా డాక్టర్‌పై సంజయ్ రాయ్ లైంగిక దాడికి పాల్పడడంతోపాటు ఆమెను గొంతు నులిమి చంపినట్టు నిర్ధారణ అయిందని,అన్ని ఆరోపణలకు సీబీఐ తగిన సాక్ష్యాధారాలను చూపిందని న్యాయమూర్తి తెలిపారు. "అన్ని సాక్ష్యాధారాలు పరిశీలించి సాక్షులను విచారించి, వాదనలు కూడా విన్నాను. వీటన్నిటి ఆధారంగా నువ్వు దోషివని తేలింది. నువ్వు దోషివి. నీకు శిక్ష పడాల్సిందే" అని న్యాయమూర్తి ప్రకటించారు. ఈ సందర్భంగా సంజయ్ రాయ్ తాను నిర్దోషినని, ఈ కేసులో తనను ఇరికించారని చెప్పాడు. తనను ఈ కేసులో ఇరికించిన ఐపీఎస్ అధికారితోసహా అందరినీ ఎందుకు విడుదల చేశారని అతను ప్రశ్నించాడు. ఈ కేసులో సాక్ష్యాలను మార్చినందుకు ఆర్‌జీ కర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తోపాటు స్థానిక పోలీసు స్టేషన్ మాజీ ఎస్‌హెచ్‌ఓకు బెయిల్ ఇవ్వడాన్ని రాయ్ ప్రశ్నించాడు. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన అనంతరం పోలీసులు దోషిని కోర్టు రూము నుంచి గట్టి బందోబస్తు మధ్య ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్‌కు తరలించారు. న్యాయమూర్తి తీర్పు విని బాధితురాలి తండ్రి భావోద్వేగానికి గురై విలపించారు. న్యాయవ్యవస్థపై తాము ఉంచుకున్న నమ్మకాన్ని న్యాయస్థానం నిలబెట్టుకుందని ఆయన తెలిపారు. తన చార్జిషీటులో నగర పోలీసు శాఖలో సివిక్ వాలంటీర్‌గా పనిచేస్తున్న సంజయ్ రాయ్‌ను ఈ కేసులో ప్రధాన, ఏకైక అనుమానితుడిగా దర్యాప్తు సంస్థ సీబీఐ పేర్కొంది. నిందితుడికి మరణ శిక్ష విధించాలని సీబీఐ న్యాయస్థానాన్ని కోరింది.

చంద్రుడు పుడమి పుత్రుడే!

న్యూఢిల్లీ: వినీలాకాశంలో వెండి వెన్నెల కురిపించే చంద్రుడు దాదాపు 400 కోట్ల సంవత్సరాల నుంచి భూమికి ఖగోళ సహచరుడిగా కొనసాగుతున్నాడు. సహజసిద్ధమైన ఈ ఉపగ్రహం ఓ భారీ విపత్తు వల్ల ఆవిర్భవించిందన్న మాట చాలా కాలం నుంచి వినిపిస్తున్నది. దాదాపు అంగారక గ్రహమంత పరిమాణంలో ఉన్న 'థియా' అనే ప్రొటో గ్రహం భూగోళాన్ని ఢీ కొనడం వల్ల చంద్రుడు ఏర్పడినట్టు శాస్త్రవేత్తలు చాలా కాలం నుంచి చెప్తున్నారు. దీర్ఘకాలం నుంచి మనుగడలో ఉన్న ఈ సిద్ధాంతాన్ని తాజా పరిశోధన సవాల్ చేసింది. చంద్రుని ఆవిర్భావం ఎలా జరిగిందో నిగ్గు తేల్చాలన్న లక్ష్యంతో గొట్టింగెన్ యూనివర్సిటీ, మాక్స్ ప్లాంక్ సోలార్ సిస్టమ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు.

గాయాలుంటేనే రేప్ జరిగినట్టు కాదు

- బాధితులంతా ఒకేలా స్పందించరు
- ఓ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 18: లైంగిక దాడి జరిగిన సమయంలో బాధితురాలు శారీరకంగా గాయపడడం లేదా రోదిస్తూ ఆర్తనాదాలు చేయడం ముఖ్యం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అటువంటి సందర్భాలలో వాస్తవికంగా అలాగే జరుగుతుందని కాని బాధితులందరూ ఒకే రకంగా ప్రతిస్పందిస్తారని కాని చెప్పలేమని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. లైంగిక దాడి కారణంగా శారీరకంగా గాయపడతారని భావించడం సాధారణ అపోహని ధర్మాసనం స్పష్టం చేసింది. భయం, దిగ్భ్రాంతి, సామాజిక కళంకం లేదా నిస్సహాయత వంటివి ప్రభావం చూపించే ఆ ఆపత్కాలంలో బాధితులు వేర్వేరుగా స్పందిస్తారని ధర్మాసనం తెలిపింది. జెండర్ స్టీరియోటైప్స్(మూస పద్ధతులు)పై సుప్రీంకోర్టు 2023లో ప్రచురించిన హ్యాండ్‌బుక్‌ను ధర్మాసనం ఉటంకిస్తూ తమకు ఆపద ఎదురైన సందర్భాలలో వేర్వేరు వ్యక్తులు వేర్వేరుగా స్పందిస్తారని తెలిపింది. తనపై లైంగిక దాడికి పాల్పడినపుడు తన వ్యక్తిగత మనస్తత్వం ప్రకారం మహిళ భిన్నంగా స్పందించవచ్చని, బాధితురాలు ప్రవర్తనను ఇది ఒప్పు లేదా ఇది తప్పు అని తీర్పు ఇవ్వలేమని ధర్మాసనం వివరించింది. 1998లో పెండ్లి పేరుతో ఓ మైనర్ బాలికను ఓ వ్యక్తి అపహరించిన కేసులో బాధితురాలి ఒంటిపై ఎక్కడా వాపులు కాని, గీతలు కాని లేవన్న వైద్యుడి నివేదిక ఆధారంగా జార్ఖండ్ హైకోర్టు కేసు కొట్టివేయడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది.

ఖైదీలకూ హక్కులున్నాయి

ఖైదీలు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి జైళ్ల పరిపాలనను సంస్కరించాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అధికరణ 21 ప్రకారం ఖైదీలు గౌరవప్రదమైన జీవితాన్ని అనుభవించేలా మెరుగైన వాతావరణం కల్పించేలా జైళ్ల సంస్కృతిని సృష్టించడానికి పరిపాలనను సంస్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గ్యాంగ్‌స్టర్ ఖైదీ వికాస్ తివారీని ఒక జైలు నుంచి వేరే రాష్ట్రంలోని జైలుకు చేసిన బదిలీని కొట్టివేస్తూ జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం పక్కన పెట్టింది. ఖైదీగా ఒక వ్యక్తి స్వేచ్ఛను కోల్పోతాడని రాష్ట్రం భావిస్తున్నదని, అయితే ఒక వ్యక్తిగా, మనిషిగా స్వేచ్ఛను కొనసాగించే హక్కును అతడు కొనసాగించగలడని తెలిపింది. ఖైదీ అయిన ఒక వ్యక్తి గౌరవాన్ని కాపాడుతూ కనీస అవసరాలను అతడికి అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఖైదీల సంస్కరణలు, పునరావాసం లక్ష్యాలను ప్రభుత్వాలు శ్రద్ధగా కొనసాగించాలని కోరింది. ఖైదీల ప్రాథమిక హక్కుల రక్షణ జైళ్ల పరిపాలన వ్యవస్థపై ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది.

ఆత్మహత్య ప్రేరేపిత నేరాన్ని యాంత్రికంగా మోపవద్దు: సుప్రీంకోర్టు

ఆత్మహత్యలకు ప్రేరేపించారనే నేరాన్ని యాంత్రికంగా మోపవద్దని సుప్రీంకోర్టు తెలిపింది. ఆత్మహత్యకు పాల్పడిన బాధితుడి కుటుంబం మనోభావాలను శాంతిపజేయడానికి ఇతర వ్యక్తులపై ఐపీసీ- 306ను ప్రయోగించకూడదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఆమోదయోగ్యం కాని విచారణ ప్రక్రియ దుర్వినియోగమై అమాయకులు దానికి బలి కాకూడదని ధర్మాసనం అభిప్రాయపడింది. 'పార్టీల మధ్య సంభాషణలు, చర్యలను వాస్తవిక దృక్కోణంలో విచారించాలి' అని ధర్మాసనం తెలిపింది. 2022 అక్టోబర్ 11న ఓ వ్యక్తి బ్యాంకు రుణం చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బ్యాంకు మేనేజర్ మహేంద్ర వేధింపుల కారణంగానే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నట్టు అతను లేఖ రాశాడు. అయితే బ్యాంకు రుణాన్ని తిరిగి చెల్లించాలని మాత్రమే ఆ వ్యక్తిని తాను అడిగానని, తన చర్యల ద్వారా అతడు ఆత్మహత్యలకు పాల్పడేలా చేసినట్టు ఎక్కడా ఆధారాలు లేవని మహేంద్ర సుప్రీంకోర్టుకు తెలిపారు.

బాంబులు విసిరి.. బర్త్‌డే చేసుకొని!

కాన్పూరు: ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో బుధవారం కొందరు రౌడీలు తమ గ్యాంగ్ లీడర్ పుట్టిన రోజును స్థానిక ప్రాంతం 'దద్దరిల్లేలా' జరిపారు. ఈ సందర్భంగా వారు రద్దీగా ఉండే లాల్ బంగ్లా మార్కెట్‌లో బాంబులు విసిరి, తుపాకులు పేల్చారు. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముగ్గుర్ని అరెస్ట్ చేసి.. అదే మార్కెట్ చుట్టూ వారిని ఊరేగించారు. వ్యాపారుల్లో ధైర్యం నింపేందుకు నిందితులను మార్కెట్లో ఊరేగించామని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని నిందితులను హెచ్చరించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాంబుల మోత బంద్

- ఇజ్రాయెల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- నేటి నుంచి అమల్లోకి తొలి దశ
- బందీల విడుదలకు అంగీకారం
- 15 నెలల గాజా యుద్ధానికి తెర

జెరూసలేం, జనవరి 18: పాలస్తీనాలోని గాజాలో 15 నెలల భీకర పోరాటానికి తెర పడనుంది. బాంబు దాడులతో శిథిలమైన వీధుల్లో ఎట్టకేలకు శాంతి పవనాలు వీయనున్నాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఖతార్ మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందానికి ఇప్పటికే హమాస్ అంగీకరించగా, తాజాగా ఇజ్రాయెల్ మంత్రివర్గం సైతం ఆమోదం తెలిపింది. దీంతో ఆదివారం నుంచి ఒప్పందంలో మొదటి దశ అమలులోకి రానున్నది. ఆరు వారాల పాటు అమలులో ఉండనున్న మొదటి దశలో ఇరు పక్షాలు పూర్తిగా కాల్పుల విరమణను పాటించనున్నాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం ప్రకటించారు.

విడుదలయ్యే వారిపై అస్పష్టత

ఆదివారం నుంచి ఇరుపక్షాలు బందీలను విడుదల చేస్తాయని ఖతార్ ప్రకటించింది. మొదటి దశలో భాగంగా తమ జైళ్లలో ఉన్న 737 మందిని విడుదల చేయనున్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. విడుదలయ్యే వారి జాబితాలో పాలస్తీనా ప్రజలు హీరోగా చూసే ఫతాహ్ పార్టీ సాయుధ విభాగాధిపతి జకేరియా జుబేదీ, ఆ దేశ వామపక్ష నేత ఖలీఫా జరార్ కూడా ఉన్నారు. అయితే, హమాస్ తమ వారిని ఎంత మందిని విడుదల చేస్తుందనే దానిపై తాము విడుదల చేసే వారి సంఖ్య ఆధారపడి ఉంటుందని ఇజ్రాయెల్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.

చిన్నాభిన్నమైన గాజా

2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్ భూభాగంపై హమాస్ దాడి చేసింది. 1200 మంది ఇజ్రాయెలీలను హతమార్చడంతో పాటు 251 మందిని కిడ్నాప్ చేసింది. ఈ దాడికి ప్రతిఘటనగా హమాస్ కేంద్రమైన గాజాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ప్రారంభించింది. 15 నెలల పాటు సాగిన ఈ యుద్ధంలో 46,500 మంది పాలస్తీనీయులు మరణించారని అంచనా. గాజాలోని 60 శాతం భవనాలు ధ్వంసమయ్యాయి. నగరంలోని 4.2 కోట్ల టన్నుల శిథిలాలను తొలగించేందుకే పదేండ్లు పట్టొచ్చనే అంచనాలు ఉన్నాయి.

విముక్తికి చేరువలో పాలస్తీనీయులు: హమాస్

15 నెలల యుద్ధంలో ఇజ్రాయెల్ అహంకారాన్ని అణిచివేశామని హమాస్ ప్రకటించింది. ఆక్రమణకు ముగింపు పలకడానికి, విముక్తి పొందడానికి, సొంత ప్రాంతానికి రావడానికి పాలస్తీనీయులు చేరువలో ఉన్నారని ప్రకటించింది. పాలస్తీనా ప్రజల త్యాగాల వల్లే ఇజ్రాయెల్ అనుకున్నది సాధించలేకపోయిందని హెజ్బొల్లా నేత నయీం ఖాసీం పేర్కొన్నారు.

ఆకాశంలో రెండు అద్భుతాలు

న్యూఢిల్లీ: గ్రహాలకు సంబంధించిన రెండు అద్భుతాలు ఈ నెల, వచ్చే నెలలో జరగనున్నాయి. వీటిలో ఒకటి 400 ఏండ్లకు ఒకసారి మాత్రమే జరిగే అద్భుతం. ఈ నెల 17, 18 తేదీల్లో రాత్రి వేళ ఆకాశంలో చూసినపుడు ఆరు గ్రహాలు వరుసగా కనిపించనున్నాయి. దీనిని గ్రహాల కవాతు అని ఖగోళ శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు. కుజ, గురు, నెప్ట్యూన్, శని, యురేనస్, శుక్ర గ్రహాలు వరుసగా కనిపించనున్నాయి. వీటిలో నెప్ట్యూన్, యురేనస్ బైనాక్యులర్స్, టెలిస్కోపు ద్వారా మాత్రమే కనిపిస్తాయి. ఫిబ్రవరి 28న ఏడు గ్రహాలు వరుసగా కనిపిస్తాయి. ఇటువంటి సందర్భం మళ్లీ 2492వ సంవత్సరంలో మాత్రమే వస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

సెకండ్ హ్యాండ్ వైద్య పరికరాల

దిగుమతి వద్దు

కస్టమ్స్‌కు సీడీఎస్‌సీఓ లేఖ

న్యూఢిల్లీ, జనవరి 18: దేశంలోకి సెకండ్ హ్యాండ్ వైద్య పరికరాలను దిగుమతి చేసుకోకుండా సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీఓ) అడ్డుకట్ట వేసింది. వీటి దిగుమతిని అనుమతించవద్దని కోరుతూ కస్టమ్స్ విభాగ